అటెన్షన్

- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణ
- నూరు శాతం ఉత్తీర్ణత, వెనుకబడిన విద్యార్థులపై దృష్టి

కె.గంగవరం: పదో తరగతి అనేది ప్రతి విద్యార్థి భవిష్యత్తు దశ దిశ నిర్దేశిస్తుంది. అందుకే మంచి ఫలితాలు సాధించాలనే కాంక్ష విద్యార్థులతో పాటు ఉపాధ్యాయుల్లోనూ బలంగా ఉంటుంది. దీనికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో కరసత్తు మొదలైంది. పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మాత్రమే ట్రిపుల్ ఐటీ సీట్లు దక్కుతాయి. అలాగే ఎన్నో ప్రతిభా పురస్కారాలు లభిస్తాయి. ఇంటర్ ప్రవేశాల్లో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు రాయితీలు కల్పిస్తాయి. ఈ నేపథ్యంలో ‘పది’లో మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా విద్యా శాఖ వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక చేపట్టింది.

ఈ మేరకు మార్గదర్శకాలు జారీ చేయడంతో రెండో శని, ఆదివారాల్లో సైతం పదో తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. దానిని డిసెంబర్ 1 నుంచి అమలు చేస్తున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం పట్టణం, రూరల్‌లో మండలాల్లో మొత్తం 38 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 3,600 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వీరికి ఈ ఏడాది మార్చి 17 నుంచి 31 వరకూ పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేలా ప్రతి పాఠశాలలో వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. రోజు ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకూ, సాయంత్రం 5 గంటల నుంచి 5.30 వరకూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు గత పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా వారిని బృందాలుగా విడదీశారు.ఏ, బీ కేటగిరీ విద్యార్థులతో సమానంగా సీ, డీ గ్రేడుల్లో ఉన్నవారిని తీసుకు వచ్చేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. తరగతి గదిలో బోధించిన పాఠ్యాంశాల పునశ్చరణ (రివిజన్) చేయిస్తున్నారు. విద్యార్థులకు అర్థం కాని అంశాలను బోధిస్తూ సందేహాలు నివృత్తి చేస్తున్నారు. క్లిష్టమైన సబ్జెట్‌లపై భయం లేకుండా పరీక్ష రాసే విధానాన్ని వివరిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు నలుగురు నుంచి 6 మంది విద్యార్థుల చొప్పున దత్తత తీసుకుని ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. దత్తత తీసుకున్న వారు ఎలా చదువుతున్నారు? ఏ సబ్జెట్‌లో వెనుకబడి ఉన్నారు? వారిలో భయాన్ని పోగొట్టి ఆత్మవిశ్వాసం నింపేలా కృషి చేస్తున్నారు.


కె.గంగవరం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ

స్టడీ అవర్స్‌తో ఉపయోగం



ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్న స్టడీ అవర్స్ ఉపయోగకరంగా ఉన్నాయి. ప్రతి అంశాన్నీ ఉపాధ్యాయుల నుంచి నేర్చుకుంటున్నాం. ఇప్పటికే సిలబస్ పూర్తయ్యింది. రివిజన్ చేయిస్తున్నారు. ఆయా సబ్జెక్టులను ప్రత్యేకంగా బోధించడంతో పరీక్షలంటే భయం పోయింది. పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తాం.

–గెద్దాడ జయబాబు, కె.గంగవరం

సబ్జెక్టుపై భయం పోయేలా..



తరగతి గదిలో వచ్చిన సందేహాలను సాయంత్రం ప్రత్యేక తరగతుల్లో నివృత్తి చేసుకుంటున్నాం. ప్రభుత్వం నిర్వహించే పరీక్షలతో పాటు ఉపాధ్యాయులు పరీక్షలు పెడుతున్నారు. తరచూ పరీక్షలు రాయడం వల్ల అన్ని విషయాలు గుర్తుంటున్నాయి. ఉపాధ్యాయుల ప్రోత్సాహం బాగుంది. మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షల్లో 550 మార్కులకు పైగా సాధించేలా ప్రణాళికాబద్ధంగా చదువుతున్నాం.

–కోసూరి నాగదుర్గ, కె.గంగవరం

మంచి ఫలితాలు సాధిస్తాం



మూడేళ్లుగా మండల వ్యాప్తంగా పదోతరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి జిల్లా స్థాయిలో నిలుస్తున్నాం. ఈ ఏడాది కూడా ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లా ప్రథమ స్థానం సాధించే దిశగా అడుగులు వేస్తున్నాం. ఉపాధ్యాయులు కూడా చాలా కష్టపడి విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు. విద్యార్థులు కూడా చక్కగా చదువుతున్నారు. మొత్తం అన్ని పాఠశాలల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించి చూపిస్తాం.

–ఎ.నాగరాజు ఎంఈఓ, కె.గంగవరం

క్లుప్తంగా

కలెక్టర్‌కు ఎమ్మెల్సీ త్రిమూర్తులు శుభాకాంక్షలు


కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: నూతన సంవత్సరం సందర్భంగా ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట త్రిమూర్తులు కలెక్టర్ మహేష్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఆయన అమలాపురం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, మొక్కను బహూకరించారు. అలాగే జేసీ నిశాంతికి కూడా శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా తోట త్రిమూర్తులు మాట్లాడుతూ, ఈ ఏడాది ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసి, సంతృప్తి పరచాలని ఆకాంక్షించారు.

కల్కి అవతారంలో శ్రీవారి దర్శనం


కల్కి అలంకరణలో శ్రీవారు

రాయవరం: వేంకటేశ్వర భక్తజన సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న దశావతార మహోత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారు గురువారం కల్కి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని కల్కి అవతారంలో అలంకరించి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాయవరం, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కరిద్దాం


సాగునీటి సంఘ అధ్యక్షులు, డీసీ విజయగోపాల్‌రాజుకు సన్మానం

కె.గంగవరం: అధికారులు, నీటి సంఘ నాయకుల సమన్వయంతో రైతు సమస్యలను పరిష్కరించుకుందామని కోటిపల్లి సాగునీటి సంఘ అధ్యక్షుడు (డీసీ) విజయగోపాల్‌రాజు అన్నారు. కోటిపల్లిలో గురువారం నీటి సంఘ అధ్యక్షులు, ఇరిగేషన్ అధికారులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రామచంద్రపురం డివిజన్ ఇరిగేషన్ ఈఈ వీవీ రామకృష్ణ అధ్యక్షత జరిగిన సమావేశంలో డీసీ విజయగోపాల్‌రాజు మాట్లాడుతూ రబీలో ప్రతి ఎకరానికి నీరు అందిద్దామన్నారు. పలు సమస్యలను పరిష్కరించాలని పలువురు సాగునీటి సంఘ నాయకులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం కొత్తగా ఎన్నికైన సాగునీటి సంఘ అధ్యక్షులు, నాయకులను సత్కరించారు. డ్రైనేజీ శాఖ డీఈ పోచారావు, నీటి సంఘ ఉపాధ్యక్షుడు తాడాల లోవరాజు, నీటి సంఘ అధ్యక్షులు గోపి సతీష్, రాయుడు వెంకటరమణ, ములకల విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం


కపిలేశ్వరపురంలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

కపిలేశ్వరపురం: పీవీఆర్ నారాయణరెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం కపిలేశ్వరపురంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ సాకా శ్రీనివాస్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఈ శిబిరంలో డాక్టర్ ప్రసాద్, డాక్టర్ నిఖిల్ వైద్య సేవలందించారు. మెరుగైన పరీక్షలు, చికిత్స అవసరమైన వారికి తగిన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తామని శిబిరం నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివచక్రవర్తి, ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు, వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

రాయవరం: పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. పాఠశాల హెచ్‌ఎం వీఎస్ సునీత ఆధ్వర్యంలో పాఠశాల చుట్టూ ఆట స్థలం వెంబడి వాకింగ్ ట్రాక్ చుట్టూ 40 మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నల్లమిల్లి అప్పారెడ్డి, ఉపాధ్యాయులు కొవ్వూరి రామారెడ్డి, ఎంఎస్ఎన్‌రెడ్డి, డి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దాళ్వా సాగుకు చొరవ చూపాలి

కాజులూరు: దాళ్వా సాగుకు రైతులు చొరవ చూపాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. గురువారం గొల్లపాలెంలో జరిగిన రైతు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి 31 నాటికి గోదావరి డెల్టా కాలువలకు నీటి పారుదల శాఖ అధికారులు సాగునీరు నిలుపుదల చేయనున్నారన్నారు. అయితే వర్షాల కారణంగా ఈ ఏడాది వరి నాట్లు జాప్యం జరుగుతుందని, కనీసం జనవరి మొదటి వారం పూర్తయ్యే నాటికైనా నాట్లు పూర్తి చేయాలన్నారు. దాళ్వా సాగుకు సమయం తక్కువ ఉన్నందున రైతులు వెదజల్లు విధానానికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. మాజీ సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగ కార్యదర్శి నిమ్మితి విజయ్, తణుకువాడ పీఏసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు తాడి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 8 అర్జీలు


ద్రాక్షారామలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ సావిత్రి

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ గ్రామ సచివాలయం వద్ద గురువారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 8 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ ఎం.సావిత్రి తెలిపారు. సర్పంచ్ కొత్తపల్లి అరుణ మాట్లాడుతూ ఈ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ వాసంశెట్టి సత్యప్రసాద్, వీఆర్వోలు పరంజ్యోతి, సురేష్, పంచాయతీ కార్యదర్శి పెట్టా సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్కూళ్ల అభివృద్ధిలో ఎస్ఎంసీల పాత్ర కీలకం


కాజులూరులో మాట్లాడుతున్న మండల విద్యాశాఖాధికారి డేవిడ్

రాయవరం: పాఠశాలల అభివృద్ధిలో స్కూలు యాజమాన్య కమిటీల పాత్ర కీలకమని ఎంఈఓలు పి.రామలక్ష్మణ మూర్తి, వై.సూర్యనారాయణ అన్నారు. మండలంలోని సోమేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మండలంలోని ఎస్ఎంసీ చైర్మన్లు, హెచ్‌ఎంలకు శిక్షణ నిర్వహించారు. ఎంఈవోలు మాట్లాడుతూ, విద్యార్థుల చేరికల విషయంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు ఆందోళనకరంగా ఉన్నాయన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలలు ఉనికిని కోల్పోకుండా ఉండాలంటే ఉపాధ్యాయులు తల్లిదండ్రుల్లో సానుకూల దృక్పథం కల్పించాలన్నారు. పాఠశాలల్లో ఎస్ఎంసీల ప్రాధాన్యం, బాలల హక్కులు, సంరక్షణ తదితర విషయాలపై రీసోర్స్‌పర్సన్లు గుంటూరి అప్పారావు, పంపన వెంకటరమణ, కలిశెట్టి శ్రీనివాస్, విల్లూరి వీరభద్రరావు, లచ్చిరెడ్డి వెంకటరమణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఎస్ఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి

కాజులూరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి యాజమాన్య కమిటీలు కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి డేవిడ్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీ సభ్యులకు గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో అధికారులు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ డేవిడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాల మెరుగుకు ఇటీవల ప్రభుత్వాలు ఎంతగానో కృషి చేస్తుందన్నారు. విద్యార్థుల పురోగతికి, పాఠశాలల అభివృద్ధికి యాజమాన్య కమిటీలు ఉపాధ్యాయులకు సహకరించాలన్నారు. ఎంఈఓ–2 జాన్, రిసోర్స్ పర్సన్లు కేవీవీ సత్యనారాయణ, డి.మునికుమారి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన విద్యార్థులు


గర్భిణులకు సీమంతం చేస్తున్న దృశ్యం


వృద్ధురాలికి రగ్గు, పండ్లు అందజేస్తున్న విద్యార్థులు

పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ

రాయవరం: ప్రార్థించే పెదవుల కన్నా, సాయం చేసే చేతులు మిన్న అన్న మదర్‌థెరిస్సా మాటలు ఉపాధ్యాయుల ద్వారా నేర్చుకున్న విద్యార్థులు ఆచరణలో చేసి చూపించారు. తాము పొదుపు చేసుకున్న సొమ్ముతో పేదలకు తమ వంతు సాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని వెదురుపాక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు చేసిన సాయం ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలిచింది. పాఠశాలకు చెందిన విద్యార్థులు మదర్‌థెరిస్సా సేవా సమితి పేరుతో సంస్థను నిర్వహిస్తున్నారు. సమితి కో–ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్న సైన్స్ ఉపాధ్యాయుడు కుక్కల శ్రీనివాస్ నేతృత్వంలో విద్యార్థులు రూ.20,150 పొదుపు చేశారు. ఆ సొమ్ముతో చలికాలంలో ఇబ్బందులు పడుతున్న 60 మంది వృద్ధులకు రగ్గులు, పండ్లు అందజేశారు. వారితో పాటు 10 మంది గర్భిణులకు మహిళా ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తల చేతుల మీదుగా సీమంతం నిర్వహించి, పౌష్టికాహారాన్ని అందజేశారు. విద్యార్థులు చూపించిన మానవత్వాన్ని సర్పంచ్ మల్లిడి పెద్దబ్బాయి, హెచ్‌ఎం పి.రాంబాబు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థుల సెక్రటరీ ఎ.నాగేంద్ర, ప్రెసిడెంట్ ఐ.కావ్యమాధురి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలువురికి వైఎస్సార్ సీపీ శ్రేణుల పరామర్శ

మండపేట: మాతృ వియోగంతో బాధపడుతున్న షేక్ అండ్ షేక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, మైనార్టీ సెల్ నాయకుడు షేక్ అలీఖాన్‌బాబాను వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ(రాజబాబు) పరామర్శించారు. గురువారం ఆయన కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్, పార్టీ నాయకులు ముమ్మిడివరపు బాపిరాజు, పెంకే గంగాధర్, పిఠాపురం సత్యనారాయణ తదితరులతో కలిసి బ్యాంకుకాలనీలో ఉన్న బాబా నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. అనంతరం 26వ వార్డు మాజీ కౌన్సిలర్ బూసాల చంటమ్మ కుమారుడు వెంకన్న అకాల మరణం చెందడంతో, గాంధీనగర్‌లో ఉన్న వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దుగ్గిరాల రాంబాబు, మొండి మురళి, పొలమాల సత్తిబాబు, సాధనాల శివ, గనిపే ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


అలీఖాన్‌బాబాను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కపిలేశ్వరపురం మండలం కార్యదర్శులు

కపిలేశ్వరపురం–1	కె.శివచక్రవర్తి	9948970046
కపిలేశ్వరపురం–2	కె.పండు	9441818405
తాతపూడి	బ్రహ్మాజీరావు	9381725156
అంగర–1	ఆర్ఎంవీవీఎస్ ఈశ్వరరావు	9618861999
అంగర–2	మహమ్మద్ అలీ షేక్	9652244131
పడమర ఖండ్రిక	పి.సత్తిబాబు	9676273393
వెదురుమూడి	వై. శారద	8790515028
వల్లూరు	కె.సత్తిబాబు	9959545391
నేలటూరు	పి.మోహన్	8008707882
నిడసనమెట్ట	జి.విజయ్‌కుమార్	9550096513
వడ్లమూరు	పి.వెంకటేశులు	8919435971
నల్లూరు	పి.రమేష్	9618988149
కాలేరు	యు.సుప్రియ	7981281398
అచ్యుతాపురం	జి.దేవీప్రసన్న	550124927
టేకి	కె.రామకృష్ణ	9951480999
టేకి	ఎస్.శ్రీనివాసు	8978306474
కేదారిలంక	కె.యశ్వంత్‌కుమార్	7780276777
మాచర	జి.చినబాబు	99853 84544
కోరుమిల్లి–1	ఆర్ఎస్‌వీ కామేశ్వరరావు	908852108
కోరుమిల్లి–2	కె.శంకరమూర్తి	9502121667
నాగులచెరువు	కె.యశ్వంత్‌కుమార్	7780276777
వాకతిప్ప	పి.వెంకటేశులు	8919435971
అద్దంకివారిలంక	జి.చినబాబు	9985384544

జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టికి అవమానం

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం నియోజకవర్గంలో జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్‌కు అవమానం జరిగింది. ఆ వివరాల్లోకి వెళితే.. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆశించిన సీటు ఇవ్వకపోయినా పొత్తు ధర్మం పాటించి ప్రస్తుత మంత్రి వాసంశెట్టి సుభాష్ గెలుపునకు కృషి చేశారు. అయితే ఇటీవల పోలిశెట్టి చిత్రాన్ని ముద్రించి ఫ్లెక్సీలను తయారు చేశారు. అయితే ద్రాక్షారామ బోసు బొమ్మ సెంటర్, జగన్నాయకుల సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో పోలిశెట్టి చిత్రాన్ని కత్తిరించి ఏర్పాటు చేయడంపై నియోజకవర్గ వ్యాప్తంగా అటు జనసేన నాయకులు, ఇటు టీడీపీ నాయకుల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ఇదే తీరు కొనసాగితే కలసి పనిచేయడం కష్టమని ఆయా పార్టీల నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు.


ద్రాక్షారామ జగన్నాయకుల సెంటర్‌లో చంద్రశేఖర్ చిత్రం కత్తిరించి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాయవరం: మరమ్మతుల కోసం స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ రామచంద్రపురం సబ్ డివిజన్ ఈఈ కె.రత్నాలరావు గురువారం విలేకరులకు తెలిపారు. రాయవరం 11 కేవీఏ ఫీడర్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని చెప్పారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో కొత్త ఆవిష్కరణలు

రామచంద్రపురం: స్థానిక రత్నంపేట మున్సిపల్ స్కూల్ వద్ద గురువారం రామచంద్రపురం మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఎంఈఓ–2 వి.నాగేశ్వరి ప్రారంభించారు. వివిధ పాఠశాలల నుంచి మొత్తం ఎనిమిది అంశాల్లో 60 ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. వ్యక్తిగత, గ్రూప్‌కు సంబంధించి విజేతలను ప్రకటించారు. వీరు 4న పి.గన్నవరంలో జరిగే జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటారని ఎంఈఓ వివరించారు. వ్యక్తిగత ప్రదర్శనలో పి.సంజయ్‌భరత్ (వివేకానంద ఈఎం స్కూల్ రామచంద్రపురం) ప్రథమ, పి.మార్టిన్ ఎల్.కుమార్ (ఎస్‌కేపీజీఎన్ హెచ్ఎస్ రామచంద్రపురం) ద్వితీయ స్థానంలో నిలిచారు. గ్రూప్ విభాగంలో కె.బాలసౌమ్య, కె.రమ్యకృష్ణ (ఎ.సావరం బాలికల మున్సిపల్ స్కూల్) ప్రథమ, పీవీవీఎస్ గణేష్, జీఎన్ దేవదీప్ (వెల్ల జెడ్పీహెచ్ఎస్) ద్వితీయ స్థానం, ఉపాధ్యాయుల టెక్నికల్ ఎగ్జిబిట్‌లో ఎం.జయప్రియ (శ్రీవివేకాంద ఈఎం స్కూల్) విజేతలుగా నిలిచారు. స్కూల్ అసిస్టెంట్ జి.శ్రీదేవి, కాపవరం హెచ్‌ఎం ఎం.సత్యనారాయణ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని రత్నంపేట హైస్కూల్ హెచ్‌ఎం వి.సుబ్బారావు పర్యవేక్షించారు. జూనియర్ కళాశాల అధ్యాపకులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

ఆకట్టుకున్న విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన

మండపేట: మండలంలోని తాపేశ్వరం పోలిశెట్టి సత్తిరాజు నాగభూషణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. గురువారం పాఠశాలలో 8 నుంచి పదో తరగతి విద్యా కులకుత ప్రదర్శనకు జరిగింది. మండలంలోని 27 పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొని, ప్రాజెక్టులు ప్రదర్శించారు. స్టూడెంట్, టీచర్ వ్యక్తిగత, స్టూడెంట్ గ్రూప్ విభాగాల్లో పోటీలు జరిగాయి. విద్యార్థి వ్యక్తిగత విభాగంలో వెలగతోడు విద్యార్థి చరణ్‌కుమార్, ద్వారపూడి పాఠశాల నుంచి కే శ్రీమణికంఠ, టీచర్ విభాగంలో అదే పాఠశాలకు చెందిన వీర్రాజు జిల్లా స్థాయి పోటీలకు అర్హత పొందినట్టు ఎంఈఓ నాయుడు రామచంద్రరావు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల విభాగంలో మండపేట స్వర్ణభారతి పాఠశాల విద్యార్థి ఎల్ రేష్మ, ఆదిత్య స్కూల్ విద్యార్థి వశిష్ఠ ప్రతిభ కనబర్చారు. ఈ నెల 4న పి గన్నవరం జిల్లా పరిషత్ పాఠశాలలో జిల్లా స్థాయి ప్రదర్శనలో వీరు పాల్గొంటారని ఎంఈవో రామచంద్రరావు తెలిపారు. అనంతరం మండలంలోని ఉపాధ్యాయులు, స్కూల్ యాజమాన్య కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. కమిటీ సభ్యులు పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తమ్మిన సురేంద్ర, ముంగర వెంకట్రాజు, జిల్లా ఏఏఎం ఓ రాంబాబు పాల్గొన్నారు.


రామచంద్రపురంలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఈఓ నాగేశ్వరి తదితరులు


మండపేటలో ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ప్రతిభ చాటాలి

కె.గంగవరం: సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనల్లో ప్రతి విద్యార్థి ప్రతిభ చాటాలని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. కె.గంగవరం ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే ప్రతి అంశాన్నీ దృష్టిలో ఉంచుకుని విద్యలో రాణించాలని కోరారు. అనంతరం విద్యార్థుల సైన్స్ ప్రాజెక్టులను ఆమె పరిశీలించి అభినందించారు. వ్యక్తగత విభాగంలో పామర్రు ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన యాంటీ స్లీప్ అలారం మొదటి స్థానం సాధించగా, దంగేరు ఉన్నత పాఠశాల విద్యార్థుల జేసీబీ రెండో స్థానంలో నిలిచింది. బృంద విభాగంలో కె.గంగవరం ఉన్నత పాఠశాల విద్యార్థుల నెత్తిమీద బరువులు పెట్టుకుని సులువుగా మోయగల సాధనం మొదటి స్థానం, సుందరపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన ఆటోమెటిక్ ప్లాంట్ వాటర్ సిస్టం రెండో స్థానంలో నిలిచాయి. టీచర్ విభాగంలో కె.గంగవరం ఉపాధ్యాయులు తయారు చేసిన పరిశుభ్రత వాహనం మొదటి స్థానం సాధించింది. వీరికి బహుమతులు ప్రదానం చేశారు. విజేతలైన విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారని సైన్స్ ఉపాధ్యాయుడు ప్రిక్కి బ్రహ్మానందం తెలిపారు. ఎంఈఓ నాగరాజు, సర్పంచ్ కోటి లక్ష్మీనరసమ్మ, ఎస్సై జానీ బాషా, నాయకులు చిర్రా రాజ్‌కుమార్, అల్లూరి దొరబాబు, ఉపాధ్యాయులు నరాల కృష్ణకుమార్, ఎస్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.


కె.గంగవరంలో విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీపీ నాగమణి తదితరులు

ప్రశ్నించే తత్వం ఆవిష్కరణలకు నాంది

రాయవరం: ప్రతి విద్యార్థి సైన్స్ పరంగా ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకుంటే, నూతన ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుందని ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటరమణ మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రతిభ చూపిన శాస్త్రవేత్తలంతా సామాన్య విద్యార్థులే అన్న విషయాన్ని గుర్తెరగాలన్నారు. ఎంఈవోలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ, హెచ్‌ఎం వీఎస్ సునీత మాట్లాడుతూ, విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీస్తే, వారిలో ప్రతిభను మేల్కొంటుందన్నారు. సేంద్రియ ఎరువులతో పంటల పెంపకం, గాలిమరతో విద్యుదుత్పత్తి, వాతావరణంలో అగ్ని పర్వతాల ప్రభావం, తాగునీటిని శుద్ధి చేయడం తదితర అంశాలపై విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉత్తమ ప్రాజెక్టులకు బహుమతులు అందజేశారు. ఎస్ఎంసీ చైర్మన్ దేవిశెట్టి చిన్ని, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


రాయవరంలో ప్రాజెక్టులు తిలకిస్తున్న ఎంపీపీ

విజేతలు వీరే:

మండల స్థాయి సైన్స్ ఫేర్ విజేతలను సైన్స్ ఫేర్ కో–ఆర్డినేటర్ ఎస్.బులిభాస్కర రామారావు తెలిపారు. వ్యక్తిగత విభాగంలో పసలపూడి, వెంటూరు జెడ్పీ పాఠశాలల విద్యార్థులు వి.దిలీప్, ఎస్.సాయికుమార్, గ్రూపు విభాగంలో రాయవరం జెడ్పీ స్కూల్ నుంచి జి.రాజు, అశోక్‌తేజ, పి.భానుప్రసాద్, మాచవరం జెడ్పీహెచ్ఎస్ నుంచి పి.సుశ్రుత్ రెడ్డి, ఓఎస్ఆర్ వరప్రసాద్, ఉపాధ్యాయ విభాగంలో పసలపూడి జెడ్పీ స్కూల్ నుంచి డి.జోసఫ్‌కుమార్ బహుమతులు సాధించారు.